


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### గోడలూ - గోడులూ

"**పాండవులు** సంపాదించిన ఆస్తి అంతా కౌరవుల పిండాకూడులకే సరిపోయిందట" భలే సామెత. అసలు నేను సంపాదించేది నా ఇంటికోసమా? ఇతరుల ఇంటికోసమా అని నేను చాలాసార్లు ఆలోచించాను.

మెడలో తాళికట్టినందుకుగాను ఆ మహానుభావుడు కూడూ, గుడ్డా, గూడుకి ఏనాడూ లోపం చెయ్యలేదు. ఇంక నేను సంపాదించాలి కాబట్టి బయటకెళ్తున్నాను. బయట కెళ్తున్నాను కాబట్టి చీరలు కొంటాను. తిరగాలి కాబట్టి కార్లో పెట్రోల్ పోయిస్తాను. అది నడవాలి కాబట్టి డ్రైవర్‌ని పెట్టాను. డ్రైవర్ రోజూ పనికి టైంకి రావాలి కాబట్టి మా ఆయన టూ వీలర్ ఇచ్చాను. అది ఇచ్చాను కాబట్టి అతను రోజూ తన పిల్లల్ని స్కూల్ దగ్గర వదిలి పెట్టి వస్తాడు. వదిలిపెట్టి వస్తాడు కాబట్టి ఆ స్కూల్‌కి ఫీజ్‌లు కట్టాలి. ఆ ఫీజులకి డబ్బు ఇవ్వాలంటే నేను డ్రైవర్‌కి జీతం పెంచుతూ ఉండాలి. ఆ డ్రైవర్‌కి టీ ఇవ్వాలి కాబట్టి, ఇంట్లో పనిమనిషి ఉండాలి. నేను ఇంట్లో ఉండను కాబట్టి మాకు వరలక్ష్మి ఉండాలి. ఈ పనివాళ్ళ మీద అజమాయిషీ చెయ్యాలి కాబట్టి మా ఇంట్లో కింద పోర్షన్‌లో మా ఆడబడుచు ఉండాలి. ఆవిడ ఉంది కాబట్టి ఆవిడకి తోచడానికి పక్కింటి వాళ్ళతో "మీ ఆకులు మా వైపు పడుతున్నాయి" అనో.. ఎదురింటివాళ్ళతో "మీ కుక్క మావాకిట్లో, మా కారుకి ఆనుకుని కాలు ఎత్తుతోందనో" పోట్లాటలుండాలి. అవన్నీ ఉట్టిరోజుల్లో నాకు తీరుబడి ఉండదు కాబట్టి ఆదివారం కొలువు దీర్చి నేను పరిష్కరించాలి. ఆదివారం కాబట్టే మా ఆయన తన కొలువుకూటంతో (ప్లంబర్, ఎలక్ట్రీషియన్ తదితరులతో) సిద్ధమై మాకు 'కాస్త టీలు పంపించు' అని ఆర్డర్లు వేస్తూ ఉంటారు. సందట్లో సడేమియా అని మా వరలక్ష్మికి మా ఆడబిడ్డ అన్న మాటలేవో గుర్తొచ్చి ముక్కు చీదుతుంది "అశ్విన్‌బాబు పెళ్ళి అయ్యాక ఇంక పనిమానేస్తానమ్మా" అని. దానికి వెంటనే బీరువా తీసి, ఊనిక్‌లోనో, పీచ్‌మోడ్‌లోనో ఆన్‌లైన్ తెప్పించిన రెండు చీరలిచ్చి 'తత్‌శాంతి' చెయ్యాలి.

"అసలు మీ అమ్మగారు పట్టించుకోకపోవడం వల్లే ఇల్లు పాడయిపోతోంది. నల్లాలు తిరగవు. ఫ్యాన్ చప్పుడు చేస్తోంది. స్విచ్చులు షాక్ కొడ్తున్నాయి. ఏ.సీ దగ్గర లీక్ అవుతోంది. మెకానిక్‌లని పిలుద్దాం అంటే ఈవిడగారు ఇంట్లో ఉండదు. తగుదునమ్మా అని పొద్దుటే కారేసుకుని ఫిల్మ్‌నగర్ వెళ్ళిపోతుంది" అని మా వారి ఉవాచ.

అసలెందుకమ్మా ఈ రొష్టు. మొగుడు తెచ్చిన దాంట్లో సంసారం చేసుకుంటూ, నీడపట్టున ఇంత ఉడకేసుకుని తిని, ఫ్యాన్ వేసుకుని రిమోట్ పట్టుకుని టీ.వి సీరియల్స్ చూస్తూ పడుకోలేకనా? ఇంత పని చెయ్యనేలా? ఇన్నిమాటలు పడనేలా? పోనీ ఇంట గెలవలేదు సరే రచ్చమాత్రం గెలిచామా? హీరోలకి కథలు చెప్దాం అంటే అబ్బే లేడీ రైటరా? ఆడకథలు చెప్తారు అంటారు. వాళ్ళ ఉద్దేశంలో రక్తాలు కాలవలు కట్టడం, టాటా సుమోలు గాల్లోకి లేవడం, హీరోకి ఇనపరాడ్ వెన్నులోంచి గుండెల్లోకి గుచ్చితే, అటునుండి ఇటు వచ్చిన ఆ రాడ్‌తోనే విలన్‌లని పొడవడం మగ కథలుట.

సరే... ఆడకథలే కావాలి. . టీ.వీ ఆన్ చేసినప్పటి నుండీ కట్టేసేదాకా కన్నీళ్ళు కాలవలు కట్టాలి. టీవీ సీరియళ్ళు చేద్దాం అంటే, చానెల్స్‌లో నరకాసురులు పడి చావనివ్వరు.

"మా ఊళ్ళో పచారీ కొట్టు వీరేశంగాడి కొడుకు పరమేశంగాడు బొత్తిగా పనికిరాకుండా 'బిత్తిరి' మాటలు చెప్తూ గాలికి తిరుగుతున్నాడా. నువ్వేదో టీ.వీ ఛానెల్‌కి హెడ్డు అయ్యావుటగా కాస్త వీడికేదైనా పని చూడూ" అంటే, వాడిని పిలిచి "ఒరే.. నువ్వు ఛానెల్‌లో సీరియళ్ళకి కథలు విను. నీకు తోచిన సలహాలు చెప్పు" అని వాడికి పని ఇస్తారు.

పరమేశంగాడికి హీరో అవ్వాలని ఉంటుంది. మామూలుగా కాదు పవన్‌కళ్యాణ్‌లా! కానీ కాలేడు. సినిమాల్లో 'బిత్తరి' గా గాలికి తిరిగే ప్రతివాడూ హీరో అయినట్టూ ఆడపిల్లలు మొదట 'వద్దు' అన్నా రెండో రీల్లో "ముద్దిమ్మందీ ...ఓ... చామంతీ" అని వెంటపడేట్టూ చూపిస్తారు కాబట్టి, పరమేశానికి ఆ కలలు వస్తుంటాయి. ఆ ఫ్రస్ట్రేషన్ అంతా ఛానెల్ కొచ్చి కథలు చెప్పేవాళ్ళమీద చూపిస్తాడు.

"మీ కథ బావుంది కానీ మిగతా మూడు సీరియల్స్‌లో అత్తాకోడళ్ళు ఉన్నారు. మీరు 'ఫిదా'లాంటి తెలంగాణా అమ్మాయీ ఆంధ్రా అబ్బాయీ కథ తెండి."... ఏంటీ? మీరు ప్రేమ కథతో వచ్చారా? మేము 'బాహుబలి'లాంటి కథ కోసం చూస్తున్నాం. "ఏంటి చాతబడులా? అయ్యో ఫలానా రైటర్ దగ్గర హక్కులు కొనాలి."

"ఏంటీ? ఈ కథ ఆ కథ కాదా? వేరే రకం చాతబడా? అయినా తెలుగునాట ఏ సినిమా చాతబడి గురించి తీసినా, ఆ రైటర్ దగ్గరే హక్కులు కొనాలి. ఎందుకంటే ఆయనకి 'క్షుద్ర' అని టైటిల్ తగిలించారు జనం."

ఈ రకంగా ఆ పరమేశం, కథలు చెప్పడానికొచ్చే 'వికెట్స్' పడగొడ్తుంటాడు. "ఈ రోజు ఎన్ని పడగొట్టావ్?" అని ఛానెల్ హెడ్ మధ్య మధ్యలో అడుగుతుంటాడు.

ఇంక ఛానెల్స్‌లో పనిచేసే అమ్మాయిలు కథ చెప్తుంటే "ఏంటండీ మొగుడు 'ఏమే' అన్నాడా? అలా ఎలా అంటాడండీ? ఏవిటీ ఆమె 'ఏరా?' అందా? అంటే అంది. పాపం పగలంతా ఇంటెడు చాకిరీ చేసీ, పిల్లలకీ అతనికీ చేసిపెట్టి అలసిపోయి అలా అంటే అంటుంది అంతమాత్రాన 'ఏమే' అంటాడా? నేను ఒప్పుకోను" అంటారు.

ఒక త్రేతాయుగపు విభీషణుడు ఉంటాడు ప్రతి ఛానెల్‌లో.. "మొగుడు, ఈవిడ్ని వదిలేసి వెళ్ళిపోయి వేరే అక్రమ సంబంధం పెట్టుకున్నా రెండొందల ఎపిసోడ్ల తర్వాత రియలైజ్ అయి వస్తే ఈవిడ ఆయన కాళ్ళమీద పడిపోవాలమ్మా.. తప్పదు. ఆడియెన్స్ ఒప్పుకోరు. రేటింగ్స్ రావు లేకపోతే" అంటాడు చెవిలో పుల్ల తిప్పుకుంటూ.

సరే చచ్చీ చెడీ సీరియల్ అప్రూవల్ తెచ్చాక, మా కె.సీ.ఆర్ చెప్పినట్టు "పొట్టోడి నెత్తి పొడుగోడు కొడితే పొడుగోడి నెత్తి పోశమ్మ కొట్టిందట" ప్రొడ్యూసర్‌లని ఛానెల్ వాళ్ళు డబ్బుల దగ్గర ఆడుకుంటే, వాళ్ళు మమ్మల్ని ఆడుకుంటారు. కొంతమంది ప్రముఖుల దగ్గర పని చెయ్యటం కన్నా ఊరూపేరూ లేని వాళ్ళదగ్గర పని చెయ్యడం మేలు. వాళ్ళనుండి డబ్బులు రాబట్టడం "తివిరి ఇసుమున తైలంబు తీసినట్లే!"

కథ రాయడానికి ఉపయోగించే క్రియేటివిటీ కన్నా, డబ్బులు వసూలు చెయ్యడానికి క్రియేటివిటీ ఎక్కువ వాడాల్సొస్తోంది. ఎంత గొప్పవాళ్ళు అయితే అంత ఎగ్గొడతారు. ఇన్ని పీత కష్టాలు పడి నాలుగు డబ్బులు సంపాదించి ఇంటికి తెచ్చేది నా ఇంటికోసం మాత్రం ఎంత మాత్రం కాదు. అర్ధమైందిగా పనిమనుషుల, డ్రైవర్ల ఇళ్ళు నడపడానికి.

మొన్న పొద్దుటే నేను ప్రొడ్యూసర్ ఎగ్గొట్టిన డబ్బులు ఎలా రాబట్టుకోవాలా అని ఆలోచిస్తూ, వ్యాకులంగా ఫిట్‌బిట్ పెట్టుకుని 90 నిమిషాలపాటు నడిచేస్తూ ఉండగా, కిందనుండి పెద్ద పెద్ద కేకలు.. మా ఆడబిడ్డ గొంతు అంతా చించుకుని "నీకు నీళ్ళిస్తే రేపు మా ఇంట్లో పెళ్ళికి నీళ్ళెవరిస్తారూ? మేం డబ్బెట్టి కొనుక్కోవాలా?" అంటోంది.

ఈ చేతిలో ఒకటీ, చంకలో ఒకటీ, మరో చేతిలో ఒకటీ, మరో చంకలో ఒక బిందెతో నాలుగు చేతులతో కాళికాదేవిలా నిలబడ్డ వరలక్ష్మి "ఉప్పు నీళ్ళేగా అడిగాను మీ అందరి బట్టలూ ఉతుకుతాను. నీళ్ళకే ఏడుస్తావేంటమ్మా? పెళ్ళి ఎప్పుడో ఫిబ్రవరిలో కదా?" అని అరుస్తోంది.

"నేనివ్వను" అని మా ఆడబిడ్డ.

"అమ్మని అడుగుతాను"

"అయినా ఇవ్వను" అని ఆడబిడ్డ.. పెద్ద పెద్ద అరుపులు. ఆ గొడవ చూడ్డానికి డబ్బులు ఇవ్వకుండానే వచ్చే జూనియర్ ఆర్టిస్టుల్లా, చుట్టూ చేరిన ఓ నలుగురు ఆడియెన్స్. నాకేం అర్ధం కాలేదు.

"పైకి రా!" అని వరలక్ష్మిని పిలిచాను.

"బోర్ వెయ్యమ్మా.. నాలుగు బిందెలు పట్టుకుంటా అన్నానమ్మా. మీ ఆడబిడ్డ ఇస్తలేదు" అంది ముక్కు చీది అది.

"నన్ను అడగొచ్చుగా ... వెళ్ళు వెళ్ళి పట్టుకో" అన్నాను.

వరలక్ష్మి పట్టుకుంటుంటే "రెండు బిందెలమించి మరొక్క చుక్క పట్టుకున్నావా? నేను ఊరుకోను" అని సినిమాలో ఫాక్షన్ విలన్‌లా మా ఆడబిడ్డ బెదిరిస్తోంది.

ఇక్కడ రెండు లక్షలు ఎగ్గొట్టిన ఆడ ప్రొడ్యూసర్‌తో నేను తన్నుకు చస్తుంటే, మధ్యలో రెండు బిందెల నీళ్ళగొడవ ఏమిటి? అసలు ఈ నీళ్ళ గొడవలతో రాష్ట్రాలు రాష్ట్రాలే మారణహోమాలు చేసేస్తున్నాయి.

"అసలు నా మాట ఖాతరు లేని ఇంటిలో నాకు ఇకనుండీ బాధ్యతలొద్దు. నేను పట్టించుకోను. పనిమనిషి ముందు పరువు తీసావు. అదే ఎక్కువైపోయింది నీకు" అని ఆరోజంతా ఆడబిడ్డ నస.

నాకు తిక్క పుట్టింది. "పోనీ దాన్ని మానిపించేద్దామా?" అన్నాను. (ఈవిడకి చెయ్యి విరిగితే అది మూడు నెలలు కన్నతల్లిలా సేవచేసింది పాపం) మొహం ముడుచుకుని వెళ్ళిపోయింది. నాలుగురోజులు ప్రచ్ఛన్న యుద్ధం.. ఈవిడ దానికి ఎత్తి గిన్నెలు పడెయ్యడం. అది చీపురుతో పుల్లలు వూడిపోయేట్లు ఇల్లు ఊడవడం. నాకు పది సొట్టగిన్నెలూ రెండు చీపుళ్ళూ అయ్యాకా, ఓనాడు ఇంటికొచ్చేసరికి వరలక్ష్మీ, మా ఆడబిడ్డా కిలకిలలాడిపోతున్నారు. అది వాళ్ళ పెరట్లో కాసిన మంచి గుమ్మడికాయ తెచ్చి ఈవిడకి ఇవ్వడం, ఈవిడ దాన్ని దప్పళం పెట్టడం. అది తిని పొగడడం... ఒకటే కిలకిల.

ఇది జరిగి వారం కాలేదు "నేను నీళ్ళు ఇవ్వను. నీ బాబుగారి సొత్తా? మోటర్ ఆన్ చేస్తున్నావ్?" అని మళ్ళీ మా ఆడబిడ్డ అరుపులు. ఈసారి మా డ్రైవర్ మీద. వాడు కారు కడగడానికి మోటర్ వేసి, నీళ్ళు వేస్ట్ చేస్తున్నాడట.

"అమ్మా మీ కారుకేగా?" అన్నాడు. ఈవిడ కారుకూతలు ఆపలేదు. వాడిని నల్లాలో బక్కెట్‌తో పట్టుకోమంది. ఈసారి నేను పట్టించుకోదలచుకోలేదు. వింటూ ఊరుకున్నాను.

ఈవడ దడదడా పైకొచ్చి "అన్నీ వింటూ ఊరుకున్నావే పట్టించుకోవా?" అంది.

"పోయినసారి నేను పట్టించుకుంటే, మీ పెద్దరికం అంతా పోయిందన్నారుగా?" అన్నాను.

"సీరియల్‌లో రాసుకో ఈ మాటలు" అంది అలకగా.

మావాడు ఇదంతా విని బయటకొచ్చి "ఏవిటీ నీళ్ళగోల?" అన్నాడు.

"ఫిబ్రవరిలో నీ పెళ్ళికి నీళ్ళు తక్కువైపోతాయి అని మీ అత్తబాధ" అన్నాను నవ్వు ఆపుకుంటూ.

"ఇంత నీళ్ళ ఎద్దడిగా ఉన్నప్పుడు నేను పెళ్ళి చేసుకోవడం అవసరమా?" అన్నాడు వాడు. ఆవిడ వంటగదిలో చెంబులు ఎత్తి పారేసింది. ఇద్దరం నవ్వు ఆపుకున్నాం. నవ్వితే ఇంకా సొట్టలు పడ్తాయి.. మా బుగ్గలు కాదు గిన్నెలు.

ఈ రోజు తెల్లారేసరికల్లా మా ఆడబిడ్డ నవ్వుతూ బోలెడు కబుర్లు "మా పెద్దాడి పెళ్ళి చిన్నాడు అమెరికా నుండి నెలముందే వస్తాడు" అని కబుర్లు. ఎవరితో అని బాల్కనీలోకెళ్ళి చూస్తే పక్కింటావిడతో, ఆర్నెల్ల క్రితం ఆవిడ మా వైపున్న మావిడి కొమ్మలు కొట్టేస్తే ఈవిడ పోలీస్ రిపోర్ట్ ఇమ్మని నన్ను తెగ పోరింది. అప్పటి నుండీ మా రెండిళ్ళ మధ్యా మాటలు లేవు. మాట్లాడడానికి నేను ఎలాగూ ఇంట్లో ఉండను. ఈవిడ మాట్లాడటం లేదు ఆవిడతో.

"వదినగారూ.. అమెరికా వెళ్ళిపోవడం లేదుగా.. ఫిబ్రవరిలో ఉంటారా?" అని ఈవిడ గోడమీంచి ఎగిరి అడగడం.

ఆవిడ ఎగిరి "ఉంటాం... ఉంటాం..." అనడం అంతా విని నవ్వుకుంటూ లోపలికి వచ్చేసా.

మా ఆయన ఫోన్ "అక్కచెప్పింది పక్కవాళ్ళతో గొడవగా వుంది మావిడికాయల విషయంలో గోడ పెంచమని. మేస్త్రీ వస్తాడు మాట్లాడు" అని.

"ఒద్దు ఇప్పటికే ఇద్దరూ ఎగరలేక అవస్తపడుతున్నారు. ఇంకా గోడపెంచితే ఎగరడం కష్టం" అన్నా.

వెనకటికి మూడోక్లాసులో నేనూ మా సందానీగాడూ పోట్లాడుకుని ముక్కు మీద గుద్దుకుని, రక్తం కార్చుకుంటూ వస్తే, వాళ్ళ అమ్మ మా ఇంటికీ, వాళ్ళింటికీ మధ్య ముళ్ళ కంచె వేయించింది.

ఆ కంచెలో దూరి, రక్తాలు కారుకుంటూ మేం కబుర్లు చెప్పుకోలేక ఆనక అవస్తపడాల్సొచ్చింది. "ఏవీ, రమణీ ... ఈ పెద్దోళ్ళున్నయ్ చూడూ! వీళ్ళకి బుద్ధిలేదే" అన్నాడు వాడు.

ఈరోజు పోట్లాడుకున్నాం అని కంచెలు వేసుకుని, గోడలు కట్టేసుకుంటామా? రేపు కలిసిపోమూ? అయినా అప్పుడప్పుడూ బాజాభజంత్రీల్లా ఈ ప్రొద్దుటే అరుపులూ, గొడవా లేకపోతే ఇండియాలో ఉన్న ఫీలింగ్ ఎక్కడొస్తుందండీ? మేరే బారత్ మహాన్.. పోట్లాడుకుంటూ.. కలిసిపోతూ... ఇలాగే ఉంటాం.




Post your comments

